క్లుప్తంగా

గ్రామదేవతకు చల్లదనం



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లండపుట్టుగ గ్రామ దేవత అసిరిపోలమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో గజముద్దతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి పండ్లుతో మొక్కులు చెల్లించారు.

అలయెన్స్ క్లబ్ ఆర్థిక సాయం



సరస్వతి పండిట్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

ఇచ్ఛాపురం: అనారోగ్యంతో బాధపడుతున్న సంతోష్ పండిట్‌కు అలయన్స్ క్లబ్ సభ్యులు రూ.12 వేలు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న సరస్వతి పండిట్ మనవడు కొంతకాలంగా అనారోగ్యానికి గురై బరంపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకొన్న అలయెన్స క్లబ్ ఆస్పత్రుల ఖర్చుల నిమిత్తం ఆదివారం సరస్వతికి సాయం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నరసింహమూర్తి, ప్రతినిధులు లక్ష్మణమూర్తి, బత్తుల వెంకటరమణ, బాలకృష్ణ, లోహిదాస్, బాలగోపాల్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ సీపీ విజయం ఖాయం'

వజ్రపుకొత్తూరు: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందని టీడీపీ నేతలు పగటి కలలు కంటున్నారని.. కానీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించడం ఖాయమని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు అన్నారు. బెండిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ రెండో సారి విజయం సాధించి సీఎం జగన్ నేతృత్వంలో విశాఖ కేంద్రంగా పాలన సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. డాక్టర్ సీదిరి అప్పలరాజు పలాస ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో రెండో సారి గెలవబోతున్నారని స్పష్టం చేశారు.

ఉపాధి ఏపీఓగా మోహనరావు



తలగాన మోహనరావు

కవిటి: ఉపాధి హామీ పథకం కవిటి మండల ఏపీఓగా తలగాన మోహనరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఓ కడియం భాస్కరరావు ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో కవిటి మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మోహనరావు బాధ్యతలు చేపట్టారు. వేతనదారులకు పూర్తిస్థాయిలో పనులు కల్పించేలా సిబ్బందిని సమన్వయం చేస్తానని ఆయన తెలిపారు.

పత్రికా పఠనంతో విజ్ఞానం



దినపత్రికలు చదువుతున్న విద్యార్థులు

టెక్కలి: విద్యార్థి స్థాయి నుంచి ప్రతిరోజూ దినపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని టెక్కలి శాఖా గ్రంథాలయాధికారి బి.రూపావతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో దినపత్రికలు చదివించారు. అనంతరం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

కంచిలి: ప్రకృతి వ్యవసాయ విధానంతో రైతులకు మేలు జరుగుతుందని మండల యాంకర్ టి.శివానందం పేర్కొన్నారు. అంపురం గ్రామంలో రైతుల సమక్షంలో నవరత్నాల కిట్స్ తయారు చేసే పద్ధతిని ఆదివారం వివరించారు. కొబ్బరి తోటలకు 6 కేజీల విత్తనాలు చొప్పున 100 మంది రైతులకు 60 కిట్లు, 60 మంది వరి రైతులకు కిట్టు 12 కిలోల చొప్పున తయారు చేశారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు కామరాజు, అంపురం యూనిట్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరు గ్రామంలోని శ్రీరామ ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ప్రత్యేక పూజల్లో శ్రీబాల త్రిపుర భైరవాలయం పీఠాధిపతి గణష్ గురూజీ పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

పుష్ప సోయగం



మందస మండలం వెంకటవరదరాజపురంలో ఇప్పిలి చంద్రశేఖర్ ఇంటి వద్ద మే పుష్పం వికసించింది. ఏడాది ఒక్కసారి మాత్రమే పుష్పించే ఈ మొక్కను కవిటి మండలం చినవంక గ్రామం నుంచి తీసుకువచ్చారు. ఇంటి వద్ద కుండీలో ఏడాదంతా సంరక్షించగా కాస్త ఆలస్యమైనా వికశించడంతో ఆనందంగా ఉందని చంద్రశేఖర్ తెలిపారు. - కాశీబుగ్గ

ఆత్మీయ సమ్మేళనం



కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. ఆటపాటలతో సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఈశ్వర్ పాత్రో మిమిక్రీ ప్రదర్శన అలరించింది. - కాశీబుగ్గ

కొండపోలమ్మ సంబరం



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని కొండపోలమ్మ కాలనీలో ఆదివారం కొండపోలమ్మ అమ్మవారి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి చల్లదనం చేసేందుకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు గజముద్దను తలపై పెట్టుకుని తిరువీధి నిర్వహించారు. - ఇచ్ఛాపురం

భవిత కేంద్రాలు.. బహుళ ప్రయోజనాలు

- ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే
- పలాస నియోజకవర్గంలో 425 మంది గుర్తింపు
- 9 వరకు కొనసాగనున్న సర్వే



భవిత కేంత్రంలో దివ్యాంగ చిన్నారులు

వజ్రపుకొత్తూరు: దివ్యాంగ చిన్నారులు బడిబాట(భవిత కేంద్రం) పట్టేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇళ్లకే పరిమితమైన ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో చేరని వారితో పాటు మధ్యలో చదువు మానేసిన వారి వివరాలు సేకరిస్తున్నారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. సర్వేలో భాగంగా ఇప్పటికే పలాస నియోజకవర్గంలో దాదాపు 70 శాతం మంది దివ్యాంగులను గుర్తించారు. బస్సు, రైలు ప్రయాణాలతో పాటు సామాజిక భద్రతా పింఛన్లు సైతం జారీ చేసేందుకు ప్రయోజనం ఉండటంతో వారంతా బడికి వచ్చేందుకు ముందుకు వచ్చారని భవిత కేంద్రం నిర్వహకులు తెలిపారు.

ఇంటింటా సర్వే..

సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగ చిన్నారులను కూడా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వాటిపై అవగాహన లేకపోవడంతో చాలా మంది తల్లిదండ్రులు వాటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. వీరికి కూడా విద్యను అందించేందుకు ప్రత్యేక కేంద్రాలు ఉన్నాయని తెలియకపోవడంతో చదువుకు దూరమై ఇళ్లకే పరిమితమైపోతున్నారు. ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ఇంటింటా సర్వే చేపడుతున్నారు. మే 1న ప్రారంభమైన ఈ సర్వే వేసవి సెలవులు కావడంతో ముమ్మరంగా సాగుతోంది.

పలాస నియోజకవర్గంలో దివ్యాంగ చిన్నారులు

	గతంలో	తాజా సర్వేలో గుర్తించినవారు
వజ్రపుకొత్తూరు	125	25
మందస	140	35
పలాస	140	30



ఇంటింటా సర్వే చేపడుతున్న భవిత కేంద్రం ఉపాధ్యాయులు

బహుళ ప్రయోజనాలు..

- ప్రత్యేక అవసరాల పిల్లల చదువుకు అవసరమైన ఉపకరణాలను ఉచితంగా మంజూరు చేస్తున్నారు.
- నెలకు రూ.300 చొప్పున రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు.
- వినికిడి దృష్టి లోపం ఉన్నవారికి ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తున్నారు.
- వైకల్య శాతం అధికంగా ఉన్నవారికి సదరం ధ్రువపత్రాలతో సామాజిక భద్రతా పింఛన్ అందించేందుకు కృషి చేస్తారు.
- రైళ్లు, బస్సుల్లో ప్రయాణం చేసేందుకు పాసుల సదుపాయం కల్పిస్తారు. పాఠశాలకు రాలేని వారి ఇళ్లకు ఉపాధ్యాయులే వచ్చి ప్రత్యేక శిక్షణ స్తారు. ఇలాంటి వారికి పాఠశాలకు వచ్చినట్టే హాజరు వేస్తారు.

చిన్నారులను గుర్తిస్తున్నాం..



మండలాల్లో ప్రత్యేక అవసరాల చిన్నారులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చురుగ్గా సాగుతోంది. ఇప్పటి వరకు చాలా మంది బడికి వచ్చే అవకాశం ఉన్నా దూరంగా ఉన్నారు. అలాంటి చిన్నారుల తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నాం.

– ఎస్.అరుణ, భవిత కేంద్రం టీచర్, వజ్రపుకొత్తూరు

రాయితీలు పొందాలి..



ప్రత్యేక అవసరాల పిల్లలు ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదు. పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని ముందుకుసాగాలి. తల్లిదండ్రులు దీనిపై దృష్టి సారించాలి. ఈ నెల 9 వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తాం

– తమ్మినాన రోజారమణి, భవిత కేంద్రం టీచర్, వజ్రపుకొత్తూరు

ఖరీఫ్‌కు కార్యాచరణ సిద్ధం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సోంపేట సబ్ డివిజన్ పరిధిలోని కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో 34560 ఏకరాల్లో వరిసాగు చేసేందుకు అవసరమైన చర్యలు ప్రారంభించామని వ్యవసాయశాఖ ఏడీ కె.జగన్మోహనరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణపై ఆదివారం 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

–కవిటి



సాక్షి ఇంటర్వ్యూ

ప్రశ్న: ఈ ఏడాది సోంపేట సబ్ డివిజన్లో వరి సాగు లక్ష్యం?

జవాబు: సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 36,000 ఎకరాల్లో సాధారణ విస్తీర్ణానికి గానూ 34560 ఎకరాల్లో వరి సాగుచేసేందుకు చర్యలు చేపట్టాం. ఈ మేరకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

ప్రశ్న: గత ఏడాది సోంపేట సబ్ డివిజన్లో సాగు పరిస్థితి?

జవాబు: గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరి సాగు కేవలం 19,000 ఎకరాల్లోనే వేయగలిగాం. ఈ సారి వర్షాలు అనుకూలించే అవకాశం ఉంది.

ప్రశ్న: ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ముందర పచ్చిరొట్ట పైర్ల వినియోగంలో ఎలాటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల్లో 35 టన్నుల జీలుగ, కట్టె జనుము, పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై ఆర్బీకేలకు సరఫరా చేసాం. ఇప్పటికే కొన్ని మండలాల్లో వీటిని పొలాల్లో రైతులు చల్లారు. ఈ ఏడాది వర్షాలు కాస్త అనుకూలించడంతో పచ్చిరొట్ట పైర్లు విత్తుకునేందుకు అవకాశం ఏర్పడింది.

ప్రశ్న: వరి విత్తనాల సరఫరాపై కార్యాచరణ?

జవాబు: సోంపేట సబ్ డివిజన్‌లో రైతుల కోరిక మేరకు ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, సాంబమసూరి (బీపీటీ 5204), శ్రీకాకుళం సన్నాలు (ఆర్‌జీఎల్ 2537) స్వర్ణ రకాలను ఆర్‌బీకేల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకున్నాం. ఇందుకు సంబంధించి త్వరలోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభిస్తున్నాం.

ప్రశ్న: ఈ ఏడాది ఎంత మొత్తంలో వరి విత్తనాలు సరఫరా చేస్తారు?

జవాబు: గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడ్డారు. నిబంధనల మేరకు 33 శాతం మాత్రమే విస్తీర్ణంలో రైతులకు రాయితీ విత్తనాలు అందించాల్సి ఉన్నా గత సంవత్సరం ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా 50% విస్తీర్ణంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందించాం.

ప్రశ్న: విత్తన శుద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

జవాబు: శాంపిల్‌గా జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద పది శాతం విస్తీర్ణానికి సుడోమోనాస్ అనే జీవసిరేంద్ర నాశినిని 50% రాయితీపై రైతులకు ఆర్‌బీకేల ద్వారా విత్తనాలతో పాటుగా అందిస్తాం.

ప్రశ్న: ప్రైవేటుగా విత్తనాల అమ్మకానికి అనుమతులు ఉన్నాయా ?

జవాబు: ప్రభుత్వ నిబంధనల మేరకు సబ్సిడీ లేకుండా నిర్ధారిత ధరకు ప్రైవేట్ డీలర్లకు కూడా విత్తనాల విక్రయాలకు అనుమతులిచ్చాం. కంచిలి మండలంలో రెండు ఇచ్ఛాపురం మండలంలో ఒక కేంద్రంలో ప్రైవేటు డీలర్ల వద్ద కూడా విత్తన సరఫరా చేసేందుకు అవకాశం కల్పించాం

ప్రశ్న: విత్తన నాణ్యతకు ఏ చర్యలు తీసుకోవాలి?

జవాబు: విత్తనాల పంపిణీకి ముందే ఆర్బీకే స్థాయిలో మొలక శాతాన్ని పరీక్షిస్తాం. అయినప్పటికీ రైతులు నారుమడులు వేసుకునేందుకు ముందు విధిగా మొలకశాతాన్ని పరీక్షించుకోవాలి. తేడాలు గమనిస్తే వారి వద్ద విత్తన సంచులు, ట్యాగులు భద్రపర్చుకోవాలి. ఒకవేళ ప్రైవేట్‌గా కొంటే రశీదులు భద్రపరుచుకుని సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

తొలకరి వర్షాలతో ఆనందం



కవిటి బస్టాండ్ వద్ద వర్షం కురుస్తున్న దృశ్యం

కవిటి:

నెలరోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో అల్లాడిపోయిన ప్రజలకు, బ్బరి చెట్లకు తాజాగా కురుస్తున్న తొలకరి వర్షాలు ఎంతో ఊరటనిస్తున్నాయి. ఆదివారం ఉక్కపోతతో అవస్థలు పడిన ఉద్దానం ప్రజలకు సాయంత్రం కురిసిన భారీవర్షం ఉపశమనమిచ్చింది. మండలంలోని దాదాపు అధికశాతం గ్రామాల్లో వర్షం కురిసింది.

వజ్రపుకొత్తూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్న రైతులకు ఆదివారం రాత్రి కురిసిన వర్షం మేలు చేకూర్చింది. కొన్ని రోజులుగా భానుడు ఉగ్రరూపం దాల్చడంతో వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో ఎండ తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోతతో జీవరాశులు విలవిల్లాడాయి. ఈ తరుణంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షం జీవరాశులకు ఊరటనిచ్చింది. కాగా ఉరుములు, మెరుపులు, పిడుగులు పడటంతో ప్రజలు భయాందోళన చెందారు.

ఇచ్ఛాపురం రూరల్: భానుడు ఆదివారం ఉదయం నుంచి సాయంత్ర ఐదు గంటల వరకు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు విలవిలలాడిపోయారు. ఆస్తమిస్తున్న సమయంలో ఒక్కసారిగా కారుమబ్బులు అలముకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురవడంతో ఉపశమనం పొందారు.



ఇచ్ఛాపురంలో అలముకున్న కారుమబ్బులు

భక్తిశ్రద్ధలతో పాలపోలమ్మ వార్షికోత్సవం



ఊరేగుతున్న దాసుడు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని రాజాం గ్రామంలో ఆదివారం పాలపోలమ్మ అమ్మవారి వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ముర్రాటలు, ప్రసాదాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మేళతాళాల నడుమ ప్రత్యేక అలంకరణతో దాసుడు ఊరేగారు.

వైభవంగా వైశాఖ ఏకాదశి పూజలు



బొరివంకలో పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

కవిటి: మండలంలోని వివిధ వైష్ణవాలయాల్లో ఆదివారం వైశాఖ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. బెజ్జిపుట్టుగ చక్రధర ఆలయం, లోళ్లపుట్టుగ కల్యాణ వేంకటేశ్వర ఆలయం, ప్రగడపుట్టుగ కోదండ రామాలయం, బొరివంక నరసింహస్వామి ఆలయాల్లో దీపారాధనలు, సహస్రనామ అర్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శివసాగర్ బీచ్‌లో 'మిరాజ్' సినిమా సందడి



చిత్ర యూనిట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. కె.ఎం.సి. ఫిలింమేకర్స్ బ్యానర్‌పై విష్ణుదేవ్ రచన, దర్శకత్వంలో తెలుగు, ఒడియా భాషలలో తెరకెక్కనున్న మిరాజ్ సినిమా చిత్రీకరణకు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కుమార్‌నాయక్ తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. ఈ మేరకు స్థానిక నీలకంఠేశ్వర స్వామీ ఆలయంలో చిత్రయూనిట్ ప్రత్యేక పూజలు చేసి పలు సన్నివేశాలను చిత్రీకరించారు. సస్పెన్స్, యాక్షన్, మిస్టరీ ప్రధానాంశాలుగా చిత్రీకరిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ పారిశ్రామికవేత్త కె.సత్యభాస్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డీఓపీగా మీర అలీఖాన్, మేనేజర్‌గా ప్రదీప్, కొరియోగ్రఫర్‌గా పత్రి తాతారావు, నటీనటులుగా కొంచాడ జీవన్‌బోటు, సుదిష్ట, దదిష్టిరేఖో , దుర్గభవాని, రమేష్ యాదవ్, నారాప్రసాద్, బమ్మిడి కృష్ణారావు, లంక చిన్నంనాయుడు, లక్ష్య, అంకిత, డీపీ స్టాలిన్, మూల తాతయ్య తదితరులు నటిస్తున్నారు.